
# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



# సంగారెడ్డి మెదక్

5

జిల్లాల వార్తలు

మంగళవారం 11 జూన్ 2024


## పిడుగుపాటుకు యువతి మృతి



అస్మిన్‌బీ

రాయికోడ్, జూన్ 10: పిడుగుపాటుకు యువతి మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల పరిధిలోని కోడూరులో సోమవారం సాయంత్రం జరిగింది. పత్తిచేనులో కూలీలు విత్తనాలు నాటుతుండగా పక్కనే పిడుగుపడడంతో అస్మిన్‌బీ(19), అనసూయమ్మకు తీవ్రగాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలిస్తుండగా అస్మిన్‌బీ మృతి చెందగా, అనసూయమ్మను మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డికి తరలించారు.










సంగారెడ్డి జిల్లాలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 4 గంటల నుంచి సుమారు రెండు గంటలపాటు ఎడతెరిపి లేకుండా కురిసింది. సంగారెడ్డి, పటాన్‌చెరు, జహీరాబాద్, సదాశివపేట, మునిపల్లి, అందోల్, నారాయణఖేడ్, హత్నూర, కంది తదితర మండలాల్లో ఉరుములు, మెరుములతో వర్షం పడింది. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రధాన రహదారులు చెరవులను తలపించాయి. రోడ్లు జలయమం కావడంతో వాహనదారులు ఇబ్బందులుపడ్డారు. పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా నిలిచిపోయింది.

-సంగారెడ్డి టౌన్

సంగారెడ్డిలో వర్షానికి జలమయమైన పట్టణ ప్రధాన రహదారి

# సాగుతాయా.. ఆగుతాయా?

## షెడ్యుల్‌లో పేర్కొన్నా.. కదలని బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ

**పండిత్, పీఈటీల అప్‌గ్రేడేషన్‌పై కోర్టుకు?**

**స్థానికంగా జోరుగా ప్రచారం**

**ఉపాధ్యాయుల్లో ఆందోళన**

సంగారెడ్డి అర్బన్, జూన్ 10 : ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు సాగుతాయా- ఆగుతాయా అన్న చర్చ ఇటు విద్యాశాఖలో.. అటు ఉపాధ్యాయల్లో సాగుతున్నది. విద్యాశాఖ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 8 వ తేదీన జడ్పీ మేనేజ్‌మెంట్‌లో హెడ్‌మాస్టర్లుగా(గ్రేడ్-2) పదోన్నతి కోసం స్కూల్ అసిస్టెంట్లు లేదా తత్సమానమైన కేడర్ పోస్టులకు సంబంధించిన ప్రొవిజినల్ సీనియారిటీ జాబితా ప్రదర్శించాలి. 9 వ తేదీన అభ్యంతరాలు స్వీకరించి, 10 వ తేదీన(సోమవారం) ఫైనల్ సీనియారిటీ జాబితా వెల్లడించాల్సి ఉంది. కానీ, ఇందులో ఏ ఒక్క పనీ ఇంతవరకు ప్రారంభం కాలేదు. అలాగే, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో భాగంగా భాషోపాధ్యాయులు (పండితులు), పీఈటీ పోస్టులు అప్‌గ్రేడేషన్ ప్రక్రియను ఆదివారం పూర్తి చేసిన విషయం తెలిసిందే. ఇందులోభాగంగా జిల్లాలో ల్యాంగ్వేజ్ పండిత్ (ఎల్‌పీ) తెలుగు-211, ల్యాంగ్వేజ్‌పండిత్ (హిందీ)-175, ల్యాంగ్వేజ్ పండిత్ (ఎల్‌పీ) ఉర్దూ-12, పీఈటీ-77 పోస్టులు అప్‌గ్రేడ్ చేసినట్లు ప్రకటించారు. అయితే పండిత్, పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్‌కు సంబంధించి కొందరు ఎస్జీటీలు సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసినట్లు ప్రచారం జరుగుతండడంతో ఏం జరుగుతుందోనని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఈసారైనా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతుందా అనే ఉత్కంఠ నెలకొన్నది.




సంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం



అర్జీలు స్వీకరిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



సంగారెడ్డిలో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

# ప్రజావాణికి వినతుల వెల్లువ

**మూడు నెలల అనంతరం నిర్వహణ**

**సమస్యలను విన్నవించడానికి తరలివచ్చిన ప్రజలు**

**అర్జీలు స్వీకరించిన మెదక్, సంగారెడ్డి కలెక్టర్లు**

సంగారెడ్డి టౌన్/మెదక్ అర్బన్, జూన్ 10 : ఎన్నికల కోడ్ ముగియడంతో మూడు నెలల అనంతరం నిర్వహించిన ప్రజావాణికి వినతులు వెల్లువెత్తాయి. సంగారెడ్డి, మెదక్ కలెక్టరేట్లలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో సమస్యలు చెప్పుకునేందుకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ వల్లూరి క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్వో పద్మజారాణి ప్రజావాణిలో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 18, డీఆర్‌డీవోకు 4, పంచాయతీరాజ్‌శాఖకు 5, ఇతర శాఖలకు సంబంధించి 21 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చి అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి అనంతరం అధికారులతో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలకోడ్ అమలులో ఉన్నందున జిల్లాలో ప్రారంభంకాని అభివృద్ధి, ఉపాధిహామీ పనులు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఈ నెల 12న బడులు ప్రారంభం రోజున విద్యార్థులకు కొత్త యూనిఫాంలు, పుస్తకాలను అందజేయాలని నిర్దేశించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**మెదక్ జిల్లాలో 91 అర్జీలు**

ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను వెంటనే పరిష్కరించాలి జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మెదక్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యలపై ఆయన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. భూ సమస్యలపై 30, పెన్షన్ కోసం 10, ఇళ్ల కోసం 3, ఉద్యోగాలు కావాలని 2, ఇతర సమస్యలపై 46 అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో విన్నవించిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తేనే ప్రజలకు ప్రభుత్వ వ్యవస్థలు, ఉన్నతాధికారులపై నమ్మకం ఏర్పడుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అలాగే, మెదక్‌లోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎస్పీ డా.బాలస్వామి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులను ఫోన్‌లో ఆదేశించారు.



# డయాలసిస్ పేషెంట్లకు భరోసా

**సంగారెడ్డి జిల్లాలో నాలుగు డయాలసిస్ కేంద్రాలు**

**అదనపు పడకలకు డిమాండ్**

**ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన ఆరోగ్యశాఖ**

సంగారెడ్డి అర్బన్, జూన్ 10 : సంగారెడ్డి జిల్లాలోని ఉచిత డయాలసిస్ కేంద్రాలు కిడ్నీ బాధితులకు అండగా నిలుస్తున్నాయి. అసలే అనారోగ్యంతో బాధపడుతున్న పేదలపై ఆర్థిక భారం పడకుండా చూస్తున్నాయి. గతంలో కిడ్నీ బాధితులు రక్తశుద్ధి (డయాలసిస్) చేసుకోవడానికి నానా అవస్థలు, ఇబ్బందులు పడేవారు. హైదరాబాద్‌లోని కార్పొరేటు ఆస్పత్రులకు వెళ్లి రక్తాన్ని శుద్ధి చేయించుకునేవారు. ఇది ఎంతో వ్యయప్రయాసలతో కూడిన ప్రక్రియ కావడంతో బాధితుల కుటుంబాలు ఆర్థికంగా కుంగిపోయేవి. ఈక్రమంలో ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా నాలుగు ప్రభుత్వ ఆస్పత్రుల్లో డయాలసిస్ కేంద్రాలను నెలకొల్పారు. కిడ్నీ వ్యాధి బాధితులకు ఇక్కడ డయాలసిస్ సేవలందిస్తూ భరోసా కల్పిస్తున్నాయి.

**అదనపు పడకలకు ప్రతిపాదనలు**

జిల్లాకేంద్రమైన సంగారెడ్డి జీజీహెచ్‌తో పాటు జహీరాబాద్, నారాయణఖేడ్, జోగిపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రుల్లో ఉచిత డయాలసిస్ కేంద్రాలను గత సర్కారు ఏర్పాటు చేసింది. సంగారెడ్డిలోని జీజీహెచ్‌లో ప్రస్తుతం తొమ్మిది పడకల ద్వారా బాధితులకు డయాలసిస్ సేవలందిస్తున్నారు. ఇక్కడ 85 మంది డయాలసిస్ బాధితులు నమోదయ్యారు. ఒక్కో బాధితుడు అవసరాన్ని బట్టి వారంలో రెండు నుంచి మూడు రోజులు డయాలసిస్ చేసుకునేందుకు వస్తున్నారు. పడకల సరిపోకపోవడంతో రాత్రి పూట డయాలసిస్ చేసుకుంటున్న పరిస్థితి ఉన్నది. దీంతో ఇక్కడ పడకల సంఖ్య పెంచాలని ప్రభుత్వానికి నివేదించారు. జహీరాబాద్‌లోని ఏరియా ఆస్పత్రిలో ఐదు పడకల డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ 39 మంది రోగులు నమోదయ్యారు. ఇక్కడ కూడా పడకల సామర్థ్యం పెంచాలన్న ఒత్తిడి రావడంతో మరో ఐదు పడకల పెంపునకు ప్రతిపాదనలు పంపారు. నారాయణఖేడ్ ఆసుపత్రిలో నాలుగు పడకల ద్వారా 35 మంది బాధితులు, జోగిపేటలో ఐదు పడకల ద్వారా 21 మంది బాధితులు డయాలసిస్ చేసుకుంటున్నారు. పటాన్‌చెరులో డయాలసిస్ కేంద్రం లేకపోవడంతో అక్కడి వారు కూడా జిల్లా కేంద్రంలోని సంగారెడ్డి జీజీహెచ్ లేదా హైదరాబాద్‌కు వెళ్తున్న పరిస్థితి ఉన్నది. ఈ నేపథ్యంలో పటాన్‌చెరులో కూడా డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని బాధితులు కోరుతున్నారు. పడకల పెంపుపై ఇదివరకే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు వైద్యశాఖ వర్గాలు తెలిపారు. ప్రభుత్వం అనుమతిస్తే ఆయా కేంద్రాల్లో పడకల సంఖ్యను పెంచుతామని పేర్కొంటున్నారు.

# సత్తా చాటని స్వతంత్రులు

**మెదక్ పార్లమెంట్ నుంచి 44 పోటీ**

**ప్రధాన పార్టీల నుంచి నలుగురు**

**40 మంది ఇండిపెండెంట్లు**

మెదక్, జూన్ 10: మెదక్ లోక్‌సభ స్థానానికి పోటీ పడిన స్వతంత్ర అభ్యర్థుల్లో ఏ ఒక్కరూ కనీస ప్రభావం కూడా చూపలేదు. ఇక్కడ మొత్తం 44 మంది అభ్యర్థులు నామినేషన్ పత్రాలు దాఖలు చేయడం రాష్ట్ర వ్యాప్తంగా ఈ నియోజకవర్గం చర్చకు వచ్చింది. బీజేపీ నుంచి రఘునందన్ రావు, కాంగ్రెస్ నుంచి నీలం మధు, బీఆర్‌ఎస్ నుండి వెంకట్రామ్ రెడ్డి నామినేషన్లు వేశారు. బీఎస్పీ పార్టీ అభ్యర్థిగా బాపట్ల ఈశ్వర్ ఎన్నికల బరిలో నిలిచారు. ఈ నలుగురు మినహా మిగిలిన 40 మంది స్వాతంతులే (గుర్తింపు లేని పార్టీ తరఫున కొందరు పోటీ చేశారు). ఇంత మంది అభ్యర్థులు పోటీ చేయడంతో ఇక్కడ మూడు ఈవీఎంలు ఏర్పాటు చేయాల్సి వచ్చింది. పోటీ చేసిన వారిలో ప్రధాన పార్టీలు పోగా బీఎస్పీ అభ్యర్థికి 7,463 ఓట్లు వచ్చాయి. అలయన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రీఫార్మ్స్ పార్టీకి చెందిన తల్లాడ నంద కిషోర్‌కు 17,216 ఓట్లు వచ్చాయి. ప్రజావెలుగు పార్టీ అభ్యర్థి సారా యాదగిరి గౌడ్‌కు 11,060 ఓట్లు వచ్చాయి. మిగిలిన అభ్యర్థులు కూడా ఎంతో కొంత ప్రభావం చూపుతారని భావించగా, తక్కువ ఓట్లకే పరిమితం అయ్యారు. భారత్ జోడోపార్టీకి 2,132 ఓట్లు, సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా( కమ్యూనిస్టు) పార్టీ అభ్యర్థి బండపల్లి శ్రీనివాస్‌కు 2,366 ఓట్లు, ఇండిపెండెంట్ అభ్యర్థి అడ్ల కుమార్‌కు 5,116 ఓట్లు పోలయ్యాయి. మిగతా స్వతంత్రులకు నామమాత్రంగానే ఓట్లు పడడంతో ఎన్నికల ఫలితాలను ఏమాత్రం ప్రభావితం చేయలేకపోయారు. కొందరు అభ్యర్థులకు వెయ్యిలోపు ఓట్లు పోలవడం గమనార్హం.

# పిల్లలంతా బడికి రావాలి

- బడీడు పిల్లలు చదువుకు దూరం కావొద్దు
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్
- బడిబాట విజయవంతం కోసం పల్లెనిద్ర
- జక్కపల్లి గ్రామంలో బస.. గ్రామస్థులతో మాటామంతి

నర్సాపూర్, జూన్ 10: బడీడు పిల్లలు ఒక్కరు కూడా బడి బయట ఉండొద్దని. అందుకు ప్రతీ ఒక్కరు బాధ్యత తీసుకోవాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. బడిబాట కార్యక్రమం విజయవంతం చేయడం కోసం కలెక్టర్ పల్లెనిద్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నిర్దేశించిన మండలాల్లో గ్రామ, మండల, జిల్లాస్థాయి అధికారులు పల్లెనిద్ర చేయాలని ఆదేశించారు. రాత్రి పల్లెలో నిద్రించి ఉదయాన్నే గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని నిర్దేశించారు. ప్రతీ అధికారి 100 ఇళ్లను సర్వే చేసి సమస్యలు తెలుసుకోవడంతో పాటు బడిడు పిల్లలను బడికి పంపించేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. మహిళా అధికారులకు మినహాయింపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి కలెక్టర్ నర్సాపూర్ మండల పరిధిలోని జక్కపల్లి గ్రామంలో పల్లెనిద్ర చేశారు. గ్రామానికి చేరుకున్న కలెక్టర్ ముందుగా గ్రామస్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలెవరూ చదువు మధ్యలో మానేయకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. బాలికలపై ప్రత్యేక దృష్టి సారించి చదివించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్‌కు దీటుగా నాణ్యమైన విద్య అందిస్తున్నామని వివరించారు. మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 12న పాఠశాలలు ప్రారంభమయ్యే లోపు ప్రతీ పాఠశాలలో కనీస సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పాఠశాలల తొలి రోజే పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందించనున్నట్లు చెప్పారు. యూనిఫాం కుట్టడం మహిళ సంఘాలకే అప్పగించడం ద్వారా వారికి ఉపాధి కలిగేలా ప్రభుత్వం చొరవ తీసుకుందని పేర్కొన్నారు. ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ కమలాద్రి, ఎంపీడీవో మధులత, అధికారులు ఉన్నారు.

**మోడల్‌స్కూల్‌లో కలెక్టర్ నిద్ర**

పల్లెనిద్రలో భాగంగా జిల్లాలో మొదటిరోజు కలెక్టర్ నర్సాపూర్ మండలం జక్కపల్లి మాడల్‌స్కూల్ నిద్రించారు. మంగళవారం ఉదయం ఆయన గ్రామంలో పర్యటించి సమస్యలను తెలుసుకుంటారు. బడిబాటలో పాల్గొని చదువు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించనున్నారు.



జక్కపల్లి మోడల్ స్కూల్‌లో నిద్రపోతున్న కలెక్టర్



## నామినేటడ్ పదవులపై
# నర్సాపూర్ నాయకుల ఆశలు

**రాష్ట్ర స్థాయి పదవుల కోసం ప్రయత్నాలు**

నర్సాపూర్, జూన్ 10: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులపై మెదక్ జిల్లా నర్సాపూర్ నాయకులు ఆశలు పెట్టుకున్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలో ముఖ్య నాయకులుగా ఉన్నవారు రాష్ట్ర స్థాయిలో ఏదేని నామినేటెడ్ పదవి వస్తుందని ఆశిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి రాజిరెడ్డి స్వల్ప మెజారిటీతో ఓడిపోగా.. పార్లమెంటు ఎన్నికలకు వచ్చేసరికి కాంగ్రెస్‌కు నియోజకవర్గంలో 18వేలకు పైగా మెజారిటీ వచ్చినందున పదవులు ఆశిస్తున్నవారి సంఖ్య పెరిగింది. అసెంబ్లీ ఎన్నికల అనంతరం బీఆర్‌ఎస్‌ను వీడి, ఎంపీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తనకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవి పక్కాగా వస్తుందనే ధీమాతో ఉన్నారు. ఆయనతో పాటు అసెంబ్లీ ఎన్నికల సమయంలో నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపు కోసం విశేషంగా కృషి చేసిన రాష్ట్ర నాయకురాలు చిలుముల సుహాసినిరెడ్డికి కూడా నామినేటెడ్ పదవి వరిస్తుందని ప్రచారం జరుగుతున్నది. వీరితో పాటు ప్రస్తుతం మెదక్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, రాష్ట్ర నాయకుడు రవీందర్‌రెడ్డి కూడా తమకు పదవులు దక్కుతాయనే ఆశతో ఉన్నారు. ఈ మేరకు రాష్ట్ర నేతల వద్ద ఇప్పటికే ఎవరికి వారు ప్రయత్నాలు చేసుకుంటున్నట్లు సమాచారం.

# గంగోజిపేటలో ముగిసిన క్రికెట్ టోర్నీ



విజేత శివ్వంపేట జట్టుకు మెమెంటో అందజేస్తున్న రామచంద్రారెడ్డి

పుల్‌కల్, జూన్ 10: చౌటకూర్ మండలం గంగోజిపేట గ్రామంలో గడిచిన పక్షం రోజులుగా జరుగుతున్న వేసవి క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. గ్రామానికి చెందిన ఫస్ట్ మీస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ మొండెద్దుల నటరాజ్‌రెడ్డి తన తాత మొండెద్దుల సుబ్బారెడ్డి జ్ఞాపకార్థం ఉమ్మడి పుల్కల్ మండల స్థాయిలో వేసవి క్రికెట్ పోటీలను ప్రతీ ఏటా నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా నిర్వహించిన ఈ టోర్నీలో 35 జట్లు పాల్గొన్నాయి. సోమవారం జరిగిన ఫైనల్‌లో శివ్వంపేట జట్టు గంగోజిపేట జట్టును ఓడించి విజేతగా నిలిచింది. విజేత జట్టుకు రూ.20 వేలు నగదు, మెమెంటో, రన్నర్‌గా నిలిచిన గంగోజిపేట జట్టుకు రూ.10 వేలతో పాటు మెమెంటోను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డీసీసీబీ మాజీ డైరెక్టర్ రాంసాని రామచంద్రారెడ్డి, సీడీసీ మాజీ చైర్మన్ భూంరెడ్డి సుభాష్‌రెడ్డిలు హాజరై క్రీడాకారులకు మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో గంగోజిపేట మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, సుల్తాన్‌పూర్ మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పార్శల రాంరెడ్డి, కుమ్మరి అశోక్, బుర్రెడ్డి మాణిక్ రెడ్డి, కె.చంద్రం తదితరులు పాల్గొన్నారు.

## గుమ్మడిదల నుంచి ఏడు పాయల వరకు

# బీజేపీ నాయకుల పాదయాత్ర

గుమ్మడిదల/నర్సాపూర్, జూన్ 10 : బీజేపీ మెదక్ ఎంపీగా రఘునందన్‌రావు విజయం సాధించడంతో గుమ్మడిదల మండలానికి చెందిన బీజేపీ నాయకులు ఏడుపాయల దుర్గామాత ఆలయానికి సోమవారం పాదయాత్రగా బయలుదేరారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా రఘునందన్‌రావు గెలిస్తే ఏడుపాయలకు పాదయాత్ర చేస్తామని మొక్కుకున్నట్టు వారు తెలిపారు. దీంతో సోమవారం గుమ్మడిదల మండల బీజేపీ జిల్లా యువమోర్చా ఉపాధ్యక్షుడు చెన్నం శెట్టి ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో ఏడుపాయల దుర్గామాత ఆలయం వరకు మొక్కుబడి చెల్లించేందుకు పాదయాత్ర చేపట్టగా కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. సోమవారం ఉదయం మెదక్ జిల్లాలోని నర్సాపూర్‌కు పాదయాత్ర బృందం చేరుకోగా నర్సాపూర్‌కు చెందిన బీజేపీ నాయకులు జిల్లా ఉపాధ్యక్షుడు గోడరాజేందర్, అసెంబ్లీ కన్వీనర్ రమణరావు, కౌన్సిలర్ బుచ్చేస్‌యాదవ్, పట్టణ అధ్యక్షుడు అంజిగౌడ్ తదితరులు ఘనంగా స్వాగతం పలికి పాదయాత్రకు తమ వంతు సంపూర్ణ మద్దతు తెలిపారు.



నర్సాపూర్‌లో పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు


జిన్నారంలో కోర్టు ఏర్పాటు కోసం స్త్రీ శక్తి భవనాన్ని పరిశీలిస్తున్న జిల్లా కోర్టు ఏవో, ఎంపీపీ, న్యాయవాదులు

## సివిల్ జడ్జి కోర్టు కోసం భవనాల పరిశీలన

జిన్నారం, జూన్ 10: మండల కేంద్రం జిన్నారంలో జూనియర్ సివిల్ జడ్జి, జూడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు ఏర్పాటు కోసం సోమవారం అధికారులు, న్యాయవాదులు భవనాన్ని పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న స్త్రీ శక్తి భవనాన్ని జిల్లా న్యాయస్థానం ఏవో శ్యామల, ఎంపీపీ రవీందర్‌గౌడ్, నర్సాపూర్ బార్ కౌన్సిల్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డిలు పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం జీవీఓ జిన్నారంలో సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు అనుమతి ఇవ్వగా, అనువైన భవనాల కోసం పరిశీలన జరిపారు. ఉపాధి హామీ స్త్రీ శక్తి భవనం కోర్టు ఏర్పాటుకు అనుకూలంగా ఉందని స్థానికుల అధికారులకు వివరించారు. భవనాలు పరిశీలించిన తర్వాత అధికారులకు నివేదిక అందజేస్తామని ఏవో తెలిపారు. కోర్టు ఏర్పాటుకు మండల పరిషత్ నుంచి సహకారం అందిస్తామని ఎంపీపీ రవీందర్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు అంజిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శంకర్‌రెడ్డి, సత్యనారాయణ, మధుశ్రీ, స్వరూపారాణి, బాలకృష్ణ, వివిధ పార్టీల నాయకులు జనార్దన్‌గౌడ్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జేఈఈ అడ్వాన్స్‌లో గిరిజన గురుకులం ప్రతిభ

నర్సాపూర్,జూన్ 10: జేఈఈ అడ్వాన్స్ ప్రవేశ పరీక్షలో నర్సాపూర్ గిరిజన గురుకుల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపల్ విక్రమయ్య తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ.మురళీకుమార్ అనే విద్యార్థి జేఈఈ అడ్వాన్స్‌లో 92 మార్కులు సాధించి ఎస్టీ విభాగంలో 391 ర్యాంకు సాధించినట్టు చెప్పారు. మొత్తం 17 మంది విద్యార్థులు హాజరు కాగా, నాలుగు నేరుగా ఐఐటీలో ర్యాంకులు, 5గురు ప్రియారిటీ ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఇద్దరు ఎన్ఐటీలో, ముగ్గురు ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందే అవకాశం పొందినట్లు పేర్కొన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను రీజనల్ కోఆర్డినేటర్ సంపత్‌కుమార్‌తో పాటు అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

## మెదక్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దాలి


సమీక్షాసమావేశంలో ఎమ్మెల్యే రోహిత్, జేసీ వెంకటేశ్వర్లు, తదితరులు

మెదక్, జూన్ 10: అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేస్తూ మెదక్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సూచించారు. సోమవారం రాత్రి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆటవీ, పోలీసు, వ్యవసాయ, ఉద్యానవన, సహకార, మెప్మా, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి, శిశుసంక్షేమ, మత్స్య శాఖ, మున్సిపల్, మైన్స్, సివిల్ సప్లై, ఎక్సైజ్, విద్య, విద్యుత్, లేబర్, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ, తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన ప్రభుత్వంలో అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందజేసి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని సూచించారు. అక్రమ ఇసుక తరలించే వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని, పేదవారి గృహనిర్మాణం కోసం ఇసుక తరలించే వారిపైన్ కాకుండా అక్రమంగా ఇసుక రవాణా చేసే వారిని ఉపేక్షించరాదన్నారు. ఎరువులు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలని, ఒకవేళ కృత్రిమ కొరత తలెత్తితే తనను నేరుగా సంప్రదించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. సమావేశంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్‌వో శ్రీనివాసరావు, ఆర్డీవో రమాదేవి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.







# రండి బాబు.. మా బడికే రండి..!

● ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయుల ప్రచారం

కుకునూరుపల్లి, జూన్ 10: మొన్నటి వరకు ఎన్నికల ప్రచారంతో హోరెత్తిన గ్రామాల్లో ఇప్పుడు విద్యాసంస్థల ప్రచారం జోరుగా సాగుతోంది. తమ పాఠశాలల్లో చేర్పించాలని ప్రభుత్వ ఉపాధ్యాయులు, తమ స్కూల్‌లో చేర్పించాలని ప్రైవేటు టీచర్లు ప్రచారం చేస్తున్నారు. పాఠశాలలు పునః ప్రారంభం కావడానికి సమయం దగ్గర పడుతుండటంతో హోరాహోరీగా ప్రచారం చేస్తున్నారు.

**అన్ని ఉచితం అంటున్న ప్రభుత్వ బడి**

ప్రభుత్వ పాఠశాలలో చేరితే అన్ని ఉచితం అంటూ ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రచారం నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని జూన్ 6 నుంచి 19 వరకు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీంతో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరుతున్నారు. మధ్యాహ్న భోజనం, రెండు జతల యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ ఇతర సౌకర్యాలు ఉచితంగా ప్రభుత్వ పాఠశాలలో అందుతున్నాయని, ప్రైవేటు పాఠశాలలు అయితే స్కూల్


బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఫీజు, బస్సు ఫీజు, పుస్తకాలు, యూనిఫామ్ ఇతర కార్యక్రమాలకు అదనంగా డబ్బులు ఖర్చు చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. కుకునూరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరో ముందడుగు వేసి ప్రధానోపాధ్యాయుడి సారథ్యంలో సిబ్బంది సహకారంతో ఈ సంవత్సరం పదో తరగతిలో తమ విద్యార్థులు సాధించిన ర్యాంకులతో పాంప్లెంట్స్ ముద్రించి ప్రైవేటు దీటుగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

**అన్ని ర్యాంకులు మావే అంటున్న ప్రైవేటు విద్యాసంస్థలు**

నర్సరీ నుంచి పదో తరగతి వరకు ఇంగ్లిష్ మీడియంలో బోధిస్తామని, పదో తరగతిలో అత్యధిక ర్యాంకులు ప్రభుత్వ పాఠశాలలో కంటే మాకే ఎక్కువ వస్తాయని ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమానికి 15 రోజుల ముందు నుండే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం తమ సిబ్బందితో గ్రామాలలో దింపారు. మండల కేంద్రంలో ఉన్న ప్రైవేటు విద్యాసంస్థలతోపాటు ఇటు సిద్దిపేట అటు గజ్వేల్ పట్టణాల నుంచి మండలంలోని గ్రామాలలో తమ సిబ్బందితో బస్సులలో వచ్చి ఉదయమే ఏడు గంటల నుండే గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. తమ విద్యార్థులు పదో తరగతిలో సాధించిన ర్యాంకులతో ఉన్న కరపత్రాలతో పాటు తమ విద్యాసంస్థలో ఎలా బోధిస్తున్నామో వివరిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు.

**ప్రైవేట్‌కే మొగ్గు..**

ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఎన్ని చెప్పినా.. కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రం ప్రైవేట్ విద్యాసంస్థల వైపే మొగ్గుచూపుతున్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన సరిగ్గా జరగదని, ప్రైవేట్‌లో పిల్లలను చదివిస్తే ఇంగ్లిష్‌లో మాట్లాడుతారని, మంచి ర్యాంకులు వస్తాయనే భావనతో ప్రైవేట్‌లో చేర్పించేందుకు ఇష్టపడుతున్నట్టు సమాచారం.


పాంప్లెంట్స్ ముద్రించి ప్రచారం నిర్వహిస్తున్న కుకునూరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

# ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

● అక్కడికక్కడే మహిళా కూలి మృతి
● మరో మహిళ పరిస్థితి విషమం


హుస్నాబాద్ ప్రభుత్వ హస్పటల్ దగ్గర ధర్నా చేస్తున్న బంధువులు, గిరిజన సంఘాల నాయకులు


కరెంటొతు కవిత(ఫైల్)

అక్కన్నపేట, జూన్ 10: రెక్కాడితే గాని డొక్కాడని గిరిజన కూలీలను ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు కబళించింది. భవన నిర్మాణ కూలి పనులకు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో మహిళ కూలి మృతి చెందింది. ఈ ప్రమాదం ఒకరికి తీవ్ర గాయాలు కాగా మరో మహిళా కూలి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన సోమవారం అక్కన్నపేట మండల కేంద్రంలోని పెట్రోల్ బంకు సమీపంలోని పంతులు తండా క్రాస్ రోడ్ వద్ద జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అక్కన్నపేట మండలం పంతులు తండా గ్రామానికి చెందిన కరెంటొతు రాజు-స్వరూప దంపతులతోపాటు రాజు మరదలు కరెంటొతు కవిత(35)కలిసి అక్కన్నపేటలో జరుగుతున్న భవన నిర్మాణ కూలి పనులకు ఏపీ 09 ఏజీ 7791 నెంబరు గల ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. పంతులు తండా క్రాస్ రోడ్ వద్దకు రాగానే హుస్నాబాద్ నుంచి జనగామకు వెళుతున్న టీఎస్ 36 టీ7327అనే నెంబర్ గల హుస్నాబాద్ డిపోకు చెందిన హెయిర్ విత్ ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ సంఘటనలో కవిత అక్కడికక్కడే మృతిచెందగా రాజు, స్వరూప తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 అంబులెన్స్ ద్వారా వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌కు తరలించారు. ఇందులో స్వరూప పరిస్థితి విషమంగా ఉంది. మృతిచెందిన కవితకు భర్త రవితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

**కుటుంబ సభ్యుల ధర్నా**

కవిత కుటుంబ సభ్యులతోపాటు తీవ్రంగా గాయపడ్డ రాజు స్వరూప కుటుంబ సభ్యులకు పరిహారం చెల్లించాలని తండావాసులు రహదారిపై ఆందోళన చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ తాండ్ర వివేక్ ఆందోళనకారులను సముదాయించి తగు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం కవిత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆస్పత్రి వద్ద కూడా బంధువులతో పాటు గిరిజన సంఘాల నాయకులు మూడు గంటల పాటు ధర్నా నిర్వహించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని, కవిత కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. హుస్నాబాద్ ఏసీపీ సతీష్ ధర్నా చేస్తున్న వారిని సముదాయించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.


అవార్డులు అందజేస్తున్నసీఎం రేవంత్‌రెడ్డి

## 'ప్రతిభ'కు పురస్కారం

నారాయణఖేడ్, జూన్ 10: పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన నారాయణఖేడ్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు. సాయికీర్తన, వైష్ణవి పదో తరగతిలో 10 జీపీఏ సాధించడంతో పండిమాతరం ఫౌండేషన్ రాష్ట్రస్థాయి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి వారికి పురస్కారాలు అందజేశారు. హెచ్ఎం అనూరాధకు కూడా అవార్డు అందించారు.

# బెల్ట్‌షాప్‌లపై చిట్యాల మహిళల సమరం

● మద్యం విక్రయించవద్దని నిరసన


చిట్యాల గ్రామంలో బెల్టుషాపుల వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

చేర్యాల, జూన్ 10: చేర్యాల మండలం చిట్యాల గ్రామానికి చెందిన పలువురు మహిళలు మద్యం విక్రయాలపై కన్నెర్ర చేస్తున్నారు. గ్రామంలో 10కిపైగా బెల్టుషాపులు ఏర్పాటు చేసి విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నారని పేర్కొంటూ ఆందోళనకు దిగారు. బెల్టుషాపుల్లో మద్యం విక్రయాలు నిలిపివేయాలని జిల్లాల ఎక్సైజ్ అధికారులకు విన్నవించినా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఇక తామే రంగంలోకి దిగారు. సోమవారం మహిళలంతా కలిసి గ్రామంలోని పలు బెల్టుషాపు వద్దకు వెళ్లి నిరసన చేపట్టారు. మద్యం విక్రయాలు మానేయాలని, మద్యం కోసం మగవారు కూలీ, నాలీ చేసిన డబ్బులు లాక్కుంటుండటంతోపాటు తమ పుస్తెలు అమ్ముకుంటున్న పరిస్థితి నెలకొందని, మహిళలను చితకబాదడమే కాకుండా హత్యాయత్నాలకు పాల్పడుతున్న దుస్థితి నెలకొందంటూ వాపోయారు. గ్రామంలో మద్యం విక్రయిస్తే ఊరుకోబోమని, ముందస్తుగా శాంతియుతంగా తెలుపుతున్నామని, కాదని నిర్లక్ష్యం చేస్తే నిత్యం షాపుల్లో మద్యం ధ్వంసం చేయడంతో పాటు ఆందోళన కొనసాగిస్తామని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బెల్టుషాపులు తొలగిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినప్పటికీ మద్యం ఏరులై పారుతుందని వాపోయారు. తమ గ్రామంలో నెలకొన్న పరిస్థితిని గుర్తించి బెల్టుషాపులు తొలగించి మద్యం విక్రయాలు జరపకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

# 16న శ్రీరామ శిల శోభాయాత్ర


కర పత్రాలను విడుదల చేస్తున్న జ్యోతిర్వాస్తు విద్యా పీఠం వ్యవస్థాపకులు మహేశ్వర శర్మ సిద్ధాంతి

సంగారెడ్డి టౌన్, జూన్ 10: శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 16న శ్రీరామ శిల శోభా యాత్ర నిర్వహించనున్నట్టు విద్యాపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ శ్రీ మహేశ్వర శర్మ సిద్ధాంతి తెలిపారు. సంగారెడ్డి మండలం పసల్‌వాదిలోని విద్యాపీఠంలో సోమవారం ఇందుకు సంబంధించిన కర పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 16న మధ్యాహ్నం 1 గంటలకు పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని సంగమేశ్వర దేవాలయం వద్ద శిలాయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. యాత్రలో పదివేల మంది భక్తులు పాల్గొంటారని పేర్కొన్నారు. 13 కోట్ల రామనామ జపం యాత్రలో జరుగుతుందని, వెయ్యి మంది మహిళలు కలశాలు ధరిస్తారని వివరించారు. రాత్రి 8 గంటలకు పసల్‌వాదిలోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠంకు యాత్ర చేరుకుంటుందన్నారు. రామా,సీత, లక్ష్మణ, భరత, శత్రుఘ్న, హనుమాన్, సుగ్రీవ, అంగద, విభీషణ, జాంబవంత సమేతుడై రామచంద్రమూర్తులను ఏక శిలపై నిర్మాణం చేయాలనే సంకల్పంతో ఈ మహత్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని వివరించారు. 18 అడుగుల పొడవు, 7 అడుగుల వెడల్పు, 10 అడుగుల ఎత్తుతో భారీ శిలపై బ్రహ్మాండ చెందిన శిల్పాలతో విగ్రహాలను చెక్కిస్తున్నామని తెలిపారు. కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని మహేశ్వరశర్మ సిద్ధాంతి కోరారు. ఈ సమావేశంలో విద్యాపీఠం సభ్యులు తోపాజి ఆనంతకృష్ణ, ప్రశాంత్‌కుమార్, సెందిల్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# అక్షరాస్యత పెంపే లక్ష్యంగా పని చేయాలి

● కలెక్టర్ రాహుల్ రాజ్


సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ అర్బన్, జూన్ 10: జిల్లాలో వందశాతం అక్షరాస్యత లక్ష్యంగా అధికారులు పని చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో త్వరలో ప్రారంభం కానున్న న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. 15 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరికి చదవడం, రాయడం రావాలన్నారు. గతంలో ఉన్న అక్షరాస్యత కంటే మెరుగైన అక్షరాస్యత నమోదు చేసి రాష్ట్రంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. ఇందు కోసం గ్రామస్థాయిలో ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామ మహిళా సంఘాలను భాగస్వామ్యం చేసుకోవాలన్నారు.

**పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలి..**

రేపటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలని, అన్ని పనులు పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో నిల్వ ఉన్న స్టాక్‌ను చెక్ చేసుకోవాలని, పాడైపోయినటువంటి స్టాకు ఏమైనా ఉంటే తీసివేయాలన్నారు. మధ్యాహ్న భోజన కార్యక్రమానికి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. 12న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌బుక్స్ త్వరగా అందజేయాలని సూచించారు. తాగునీరు, విద్యుత్ సమస్య లేకుండా చూడాలన్నారు. అంగన్‌వాడీ పాఠశాల పూర్తయిన విద్యార్థులను ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని సూచించారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని, అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఈవో రాధాకిషన్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీ


కంగ్టిలో ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

కంగ్టి, జూన్ 10: మండల కేంద్రమైన కంగ్టిలోని ఫర్టిలైజర్ దుకాణాలను సోమవారం వ్యవసాయ, పోలీస్ శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీ చేశారు. అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టాకు వివరాలతో పాటు రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్, ఏఎస్ఐ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

**కోహీర్‌లో..**

కోహీర్, జూన్ 10: మండల కేంద్రమైన కోహీర్ తోపాటు మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి, కవేలి చౌరస్తాలో గల పలు ఫర్టిలైజర్ దుకాణాలను జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఫర్టిలైజర్ దుకాణదారులు నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను మండలంలోని ఎమ్మార్పీకే ధరలకే విక్రయించాలన్నారు. ఎక్కడైనా నకిలీ ఎరువుల విత్తనాలు విక్రయిస్తే ఆ మేరకు సమాచారాన్ని సంబంధిత వ్యవసాయాధికారులకు సమాచారం అందించాలన్నారు.

# కౌన్సిల్ సమావేశం రసాభాస

● అధికారుల తీరుపై మండిపడ్డ కౌన్సిలర్లు
● కమిషనర్ ప్రసన్నరాణిపై ఆగ్రహం
● స్టేజిపై నుంచి దిగి అధికారులతో కలిసి స్టేజి కింద కూర్చోవాలంటూ ఒత్తిడి


స్టేజి కింద కూర్చున్న మున్సిపల్ కమిషనర్

సిద్దిపేట టౌన్, జూన్10: సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా కొనసాగింది. సమావేశం ప్రారంభం కాగానే మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి స్టేజిపై కూర్చోవడంతో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు అధికారులతో పాటు స్టేజి కింద కూర్చోవాలంటూ బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు పట్టుబట్టారు. దీంతో కమిషనర్ ప్రసన్నరాణి అధికారులతో కలిసి స్టేజి కింద కూర్చుండి పోయారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ.. కౌన్సిలర్లు వార్డు సమస్యలపై కమిషనర్ దృష్టికి తీసుకువెళ్తే పట్టించుకోవడం లేదని, కనీసం తమకు మర్యాద కూడా ఇవ్వడంలేదని మండిపడ్డారు. మున్సిపల్ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై వచ్చిన అధికారులను వారివారి స్థానాలకు తిరిగి పంపించాలని పట్టుబట్టారు.

**తప్పు చేస్తే ఎవరినీ ఉపేక్షించం**

మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఎవరు తప్పు చేసిన ఉపేక్షించేది లేదని మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు మండిపడ్డారు. కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పాలకవర్గం సభ్యులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే సిద్దిపేట పట్టణానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సమావేశంలో భాగంగా అజెండాలో పొందుపరిచిన అంశాలను సభ్యులు ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ అదనపు కమిషనర్ మల్లికార్జున్, పట్టణ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, విద్యుత్‌శాఖ అధికారులు, పబ్లిక్ హెల్త్ అధికారులు పాల్గొన్నారు.

**సీడీఎంఏకు ఫిర్యాదు**

సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో మహిళ అని చూడకుండా తనను తీవ్రంగా అవమానించారంటూ, సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి హైదరాబాద్‌లోని కమిషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ)కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌన్సిల్ సభ్యులు తాను ఏ తప్పు చేయకుండానే స్టేజిపై కూర్చున్న తనను కావాలనే కింద కూర్చోవాలని చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు.

**కమిషనర్‌ను అవమానించారు**

**: అత్తుజమాల్**

సిద్దిపేట టౌన్, జూన్10: మున్సిపల్ సమావేశంలో స్టేజ్ పైన ఉండాల్సిన మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణిని మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు స్టేజి కింద కూర్చోబెట్టి అవమానించారని కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ మండిపడ్డారు. శనివారం సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ.. చైర్మన్ మంజుల భర్త రాజనర్సు కనుసన్నల్లో పనిచేస్తున్న కొందరు కౌన్సిలర్లు కమిషనర్ ప్రసన్నరాణి పట్ల అమర్యాదగా ప్రవర్తించి, సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరించారని మండిపడ్డారు. త్వరలోనే తమతో టచ్‌లో ఉన్న మున్సిపల్ కౌన్సిలర్లతో సంప్రదించి జెడ్పీ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గ్యారెల మధు, గయాజుద్దీన్, రాజాద్, సజ్జు పయాజ్, ఆబిద్‌రెడ్డి, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## ఏడుపాయల ఈవోగా వినోద్‌రెడ్డి


ఏడుపాయల నూతన ఈవో వినోద్‌రెడ్డి

పాపన్నపేట జూన్ 10: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయ ఈవోగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ వినోద్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయనను వనదుర్గా ఆలయ ఈవోగా నియమితులయ్యారు. ఆలయ సిబ్బందిని అడిగి ఆయన ఆలయ వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానని చెప్పారు. భక్తులకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు.

# ప్రగతి నివేదికలు లేకుండానే కానిచ్చేశారు

● కొండాపూర్ మండల సర్వసభ్య సమావేశం



అధికారులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు



ఎంపీటీసీల వీడ్కోలు సమావేశంలో సభ్యులను సన్మానిస్తున్న ఎంపీపీ,ఎంపీడీవో తదితరులు

కొండాపూర్, జూన్ 10: పాలకవర్గానికి చివరి సమావేశం కావడంతో సభ్యులు అభివృద్ధి, అనుభవాల గురించి వివరించగా, తమ శాఖల తరఫున ప్రగతి నివేదికలను సమర్పించాల్సిన అధికారులు మాత్రం ఆ సంగతే మర్చిపోయి సభను ముగించడం చర్చనీయాంశంగా మారింది. సోమవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మనోజ్‌రెడ్డి అధ్యక్షతన ఎంపీడీవో జ్యోతిలక్ష్మి నిర్వహించారు. సర్వసభ్య సమావేశం ఉదయం 11గంటలకు ప్రారంభమౌతుందని ఏజెండాలో ఉన్నా, అధికారులు సమయపాలన పాటించలేదు. 11గంటలకు ప్రారంభం కావల్సిన సమావేశం గంట ఆలస్యంగా 12గంటలకు మొదలైంది. అ సమయానికి ఆరు శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. సమావేశం ముగిసేసరికి 16 శాఖల హాజరు కాగా, మరో 11శాఖల అధికారులు హాజరు కాలేరు. హాజరైన అధికారులు కూడా గత మూడునెలల్లో జరిగిన అభివృద్ధి, సంక్షేమం, సమస్యల పరిష్కారం జరుగబోయే ప్రగతిపై నివేదికను చదివి వినిపించలేదు. పాలకవర్గం సభ్యులు తమ పదవీ కాలంలో సాధించిన అభివృద్ధి, అనుభవాలపై మాట్లాడగా, ఆయా శాఖల నివేదికలను సమర్పించాల్సిన అధికారులు ఆ సంగతే మర్చిపోయి, సభ్యులను సన్మానించి సమావేశాన్ని ముగింపజేశారు. అభివృద్ధికి సంబంధించి విషయాల ఊసే ఎత్తకుండా వచ్చింది మరిచి వెళ్లిపోయారా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

## అభివృద్ధికి అహర్నిశలు శ్రమించాం: ఎంపీపీ

సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ.. మండల అభివృద్ధి కోసం టెండర్ వర్క్ పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు బతిమాలి పనులు చేయించామన్నారు. గ్రామాలకు సరఫరా అయ్యే విద్యుత్‌కు ఏబీ స్విచ్‌లు లేక విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మల్లేపల్లిలోని తెగిన చెరువు కట్ట మరమ్మతుల కోసం ఎస్టిమేషన్ వేయడానికి రెండున్నరేళ్ల సమయం పట్టిందని, కట్టతెగి రైతులకు, తెర్పోల్, హరిదాఎపూర్ తదితర గ్రామాల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. మరేపల్లి నుంచి సికోనాపూర్, తొగర్‌పల్లి నుంచి కొండాపూర్‌కు టెండర్‌వర్క్‌లో రోడ్డు వేయడానికి కాంట్రాక్టర్లను దండం పెట్టి పనులు చేయించాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత పార్టీ నాయకులే తమపై రాజకీయ కక్షతో తమ గ్రామంలోని కూలీలపై (డెకాయిట్)నాన్ బెయిలబుల్ కేసులు పెట్టారని ఆరోపించారు. ఎంపీపీ పదవీలో ఉన్న కారణంగా ఏదోలా సమస్యలను అధిగమించినట్టు వివరించారు. నాయకులందరి ప్రోత్సాహంతో జిల్లాలో ఉత్తమ వైద్య, విద్య పురస్కార్ మండలంగా అవార్డులను అందుకోవడం ఆనందం కలిగించిందన్నారు. సభ్యులుగా ఐదేళ్ల పదవీ కాలంలో ప్రజా సమస్యలకు సంబంధించి అధికారులపై వత్తిడి తెచ్చామే తప్ప సొంత ప్రయోజనలకు కాదని, ఈ విషయాన్ని అధికారులు గుర్తుంచుకోవాలని కోరారు. చివరగా పాలకవర్గ సభ్యులకు చివరిసమావేశం కావడంతో వారిని అధికారులు సన్మానించారు. సమావేశంలో ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్‌లు, డీటీ ప్రదీప్, పలు శాఖల అధికారులు హాజరయ్యారు.

# చేసిన పనులకు బిల్లులు ఇవ్వరా?

● మునిపల్లి మండల సర్వసభ్య సమావేశంలో ఏఈని నిలదీసిన జడ్పీటీసీ



పీఆర్‌ఏఈ మధూకర్‌ను నిలదీస్తున్న జడ్పీటీసీ మీనాక్షి

మునిపల్లి, జూన్ 10: గత ప్రభుత్వ హయాంలో జరిగిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపు విషయంలో పంచాయతీరాజ్ అధికారులు నిర్లక్ష్యం ఎందుకు చేస్తున్నారని మండల సభలో జడ్పీటీసీ పైతర మీనాక్షి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ చేస్తే కనీసం లిఫ్ట్ కూడా చేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం ఎంపీపీ శైలజ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చేపట్టిన పనులకు మాత్రమే బిల్లులు అడుగుతున్నాం కాని.. చేయని పనులకు కాదని పంచాయతీరాజ్ ఏఈని ప్రశ్నించారు. అందుకు ఏఈ స్పందిస్తూ గతంలో పనులు చేసినప్పుడు పీఆర్ ఏఈగా మొగులయ్య ఉన్నారని, ఆయన ఇంకా తనకు పనులకు సంబంధించిన రికార్డు ఇవ్వలేదని సమాధానమిచ్చారు. దీంతో జడ్పీటీసీ కల్పించుకొని అప్పులు చేసి పనులు చేస్తే ఇప్పటి వరకు బిల్లులకు సంబంధించి రికార్డు చేయకపోవడం దారుణమన్నారు. పెండింగ్ బిల్లులు వచ్చేలా జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి బిల్లులు వచ్చేలా కృషి చేయాలని ఎంపీడీవోను కోరారు. అలాగే ధరణి పోర్టల్‌తో పౌతి మార్పిడి కాక ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయంలో ఎమ్మార్వో దృష్టి సారించాలని డిప్యూటీ తహసీల్దార్ కృపానందంను పెద్దగోపులారం ఎంపీటీసీ పాండు కోరారు. అదే విధంగా పంటలకు సంబంధించి వర్షాలకు దెబ్బతిన్న, ఎండు ముఖం పట్టినా.. పంట బీమా వర్తిస్తుందని, ఏఈవోల వద్ద పంట బీమాను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం ఎంపీటీసీల పదవీకాలం జూలైనె ముగుస్తున్న సందర్భంగా ఐదేళ్ల పాటు చేసిన అభివృద్ధికి సహకరించిన ప్రజాప్రతినిధులకు, అధికారులకు జడ్పీటీసీ పైతర మీనాక్షి, ఎంపీపీ శైలజ, ఎంపీడీవో హరినందన్ రావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు శివకుమార్, సంతోష్ కుమార్, ప్రశాంత్, బాగయ్య, దశరథ్, శైలజ, అఖిల, సందీప, యాదగిరి, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెంటెంట్ రామలింగం, ఎంపీటీసీ సభ్యులు పాండు, శివకుమార్, రేణుక, లక్ష్మి, విజయ, రాధాబాయి, స్వప్న, మండల కో ఆప్షన్ సభ్యుడు సలావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## కల్హేర్ విద్యార్థికి ప్రతిభా పురస్కారం



వంశీకి అవార్డు అందజేస్తున్న వీరశైవ లింగాయత్ సంఘం రాష్ట్ర నాయకులు

కల్హేర్, జూన్ 10: పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన కల్హేర్ విద్యార్థి కూర వంశీకి రాష్ట్ర వీరశైవ లింగాయత్, లింగ బలిజ సంఘం, యువత విభాగం ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో ప్రతిభా పురస్కారం అందజేశారు. ఎంబీ బిర్లా సైన్స్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో వంశీకి ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పట్లోళ్ల సంగమేశ్వర్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప, ప్రధాన కార్యదర్శి దినేష్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## బుగ్యానాయక్ తండాలో యువకుడి అదృశ్యం



కేతావత్ జైపాల్

కల్హేర్, జూన్ 10: సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని కల్వోనికుంట గ్రామపంచాయితీ బుగ్యానాయక్ తండాకు చెందిన యువకుడు అదృశ్యమయ్యారు. సోమవారం కల్హేర్ ఎస్ఐ వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం.. బుగ్యానాయక్ తండాకు చెందిన కేతావత్ జైపాల్(27) అనే యువకుడికి మానసిక స్థితి బాగా లేకపోవడంతో అప్పుడప్పుడూ ఇంటి నుంచి వెళ్లి తిరిగి వచ్చేవాడని తెలిపారు.నెల రోజుల క్రితం వెళ్లిన జైపాల్ తిరిగి రాకపోవడంతో అతడి కుటుంబీకులు గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో అతడి భార్య కవిత పోలీసులను ఆశ్రయించింది. మిస్సింగ్ కేసు దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.

## మట్టి తరలిస్తున్న మూడు టిప్పర్ల పట్టివేత

నర్సాపూర్, జూన్ 10: మండలంలోని మూసాపేట గ్రామ సమీపంలోని చెరువు నుంచి నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలిస్తున్న మూడు టిప్పర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ పుష్పరాజ్ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మూసపేట చెరువు నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఎక్స్‌కవేటర్ యంత్రాల ద్వారా పెద్దఎత్తున తవ్వకాలు చేసి టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు మట్టిని తరలిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మూడు టిప్పర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నట్లు తెలిపారు.

## నిమ్జ్ భూబాధితులకు పునరావాసం కల్పించాలి



నిమ్జ్ కార్యాలయ అధికారికి వినతి పత్రం సమర్పిస్తున్న బాధిత రైతులు

జహీరాబాద్, జూన్ 10: నిమ్జ్ భూబాధితులకు ప్రభుత్వం పునరావాసం కల్పించాలని వ్యవసాయకార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని నిమ్జ్ కార్యాలయం ఎదుట ఎల్గోయి, ముంగి తండా తదితర గ్రామాలకు చెందిన రైతులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013 చట్టంలోని హక్కులప్రకారం భూమి లేని కూలీలకు పునరావాసం కల్పించాలని ఉన్నత న్యాయస్థానం చెప్పినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. భూముల్లో పంటలు వేయరాదని అధికారులు చెప్పడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. పాలకులు, అధికారులు భూమిలేని నిరుపేదలకు పునరావాసం కల్పించాకే సదరు భూములను తీసుకోవాలన్నారు. లేకపోతే వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలను చేస్తామన్నారు. అనంతరం నిమ్జ్ కార్యాలయ ప్రత్యేక డిప్యూటి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయకార్మిక సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు

## కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తథ్యం



కాంగ్రెస్‌లో చేరిన పిల్లుట్లకు చెందిన బీజేపీ నాయకుడు

నర్సాపూర్, జూన్ 10: కాంగ్రెస్ పార్టీకి నర్సాపూర్ నియోజకవర్గంలో తిరిగి పూర్వవైభవం రానుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవులరాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ పేర్కొన్నారు. సోమవారం నర్సాపూర్‌లోని ఆవులరాజిరెడ్డి క్యాంపు కార్యాలయంలో శివ్వంపేట మండలం పిల్లుట్లకు చెందిన బీజేపీ నాయకుడు దాసరికృష్ణ ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, రాష్ట్ర నాయకులు సుహాసినీరెడ్డి, కరుణాకర్‌రెడ్డి సమక్షంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవులరాజిరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ సత్తాచాటుతామన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలను గ్రామాల్లో విస్తృతంగా తీసుకెళ్తామన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పటాన్‌చెరు, జూన్ 10: నేడు అమీన్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలో పలు కాలనీలలో విద్యుత్ పనుల నిర్వహణలో భాగంగా పలు ఫీడర్ల పరిధిలో సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ వెంకట్‌రాంరెడ్డి తెలిపారు. 11కేవీ బందంకొమ్ము ఫీడర్ పరిధిలో ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, బంధంకొమ్ము గ్రామం, ఓడీఎఫ్ కాలనీ, మారుతీహిల్స్, కష్ణబృందావన్, మైత్రీకాలనీ, లక్ష్మీహోమ్స్, 11కేవీ ఆర్‌ఆర్ హోమ్స్, వెదిరికాలనీ ఫీడర్ల పరిధిలోని కేజీఆర్, సాయివిల్లాస్, గ్రీన్‌విల్లాస్, ఆర్‌ఆర్.హోమ్స్, ఎస్‌ఎస్.హోమ్స్, అమీన్‌పూర్ గ్రామం, సాయిరాజేశ్వరి, చక్రపురి, ప్రైడ్ పార్క్, సబ్బేహోమ్స్, ఎంపైర్ మిడోస్ కాలనీలలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. 11కేవీ అమీన్‌పూర్ ఫీడర్, లక్ష్మీ హోమ్స్ ఫీడర్ల పరిధిలో ఉదయం గం.8 నుంచి గం.9వరకు భరత్‌నగర్, అమీన్‌పూర్ గ్రామం, సాయిఎంక్లేవ్, పీఎస్‌ఆర్, కాలనీ, సాయిఅంబిక, లాలాబాయి, లక్ష్మీ హోమ్స్, ఎమ్మెస్ హోమ్స్, సత్యకృప, త్రిపుర, లింగమయ్యకాలనీ, భవానిపురం, సాయిరాంకాలనీ, కేఎస్‌ఆర్.కాలనీల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్రకటించారు. ఇందుకు ఆయా కాలనీల ప్రజలు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

## బాధితులకు పరామర్శ

నారాయణఖేడ్, జూన్ 10: విద్యుత్ షాక్‌తో తీవ్ర గాయాలకు గురై నారాయణఖేడ్ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న కల్హేర్ మండలం మొదుళ్లకుంట తండాకు చెందిన రాములునాయక్‌ను మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచు నజీబ్, జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పరమేష్ ఉన్నారు.

## ఆలయ వార్షికోత్సవాలు

నారాయణఖేడ్, జూన్ 10: మండల పరిధిలోని కొండాపూర్ సామ్యనాయక్ తండాలో సోమవారం సేవాలాల్ మహరాజ్, భవానీమాత ఆలయ వార్షికోత్సవ వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపట్టారు.

## మాదిగ జనసభ పోస్టర్ ఆవిష్కరణ

నారాయణఖేడ్, జూన్ 10: మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్‌తో ఈ నెల 15న సాయంత్రం ఖేడ్‌లో నిర్వహించనున్నమాదిగల జన సభకు సంబంధించిన పోస్టర్లను సోమవారం స్థానిక ఎమ్మెల్యేసంజీవరెడ్డి సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు.





# మండల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలి

● చిలప్‌చెడ్ మండల సర్వసభ్య సమావేశం

చిలప్‌చెడ్, జూన్ 10: అధికారులు అందరూ ప్రత్యేక శ్రద్ధ చూపి మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకురావాలని ఎంపీపీ వినోదాదుర్గారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వినోదాదుర్గారెడ్డి అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో ఆనంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు వారు గత మూడు నెలల్లో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. మొదట రెవెన్యూ శాఖకు సంబంధించిన వివరాలను ఆర్ఐ వెంకటేశ్వర్లు వివరిస్తుండగా సభ్యులు మధ్యలో కలుగజేసుకుని పెండింగ్‌లో ఉన్న కళ్యాణలక్ష్మి చెక్కుల సమస్యను తొందరగా పరిష్కరించాలని, మండలంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఇటుక బట్టీలపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పందించిన ఆర్ఐ వారం రోజుల్లో అనుమతులు లేని ఇటుక బట్టీలను తొలగిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎంఈవో బుచ్చానాయక్ మాట్లాడుతూ.. మండలంలో 6 ఉన్నత పాఠశాలలు, 20 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద 21 పాఠశాలలు మంజూరు కాగా, వాటి మరమ్మతు పనులు కూడా చివరి దశకు వచ్చాయన్నారు. 10 తరగతి పరీక్షల్లో మండలానికి జిల్లా స్థాయిలో మండలి గుర్తింపు వచ్చిందని తెలిపారు. విద్యార్థులకు త్వరలో ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులను అందజేస్తామన్నారు. అనంతరం కేజీబీవీ పాఠశాల ప్రత్యేక అధికారి అంజలి మాట్లాడుతూ.. పాఠశాలల్లో సమస్యలను వివరించారు. తాగునీటి సమస్యతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని మరుగుదొడ్లు కూడా సరిగాలేవని సభదృష్టికి తీసుకు వచ్చారు. పాలకవర్గం పదవీ కాలం ముగియనుండడంతో ఇదే చివరి సమావేశమైనందున వారికి అందరికి సభ్యులందరినీ అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విశ్వంబర్, ఎంపీటీసీలు సుభాష్‌రెడ్డి, మల్లమ్మ సంగాగౌడ్, భూలి శంకర్, కోఆప్షన్ మెంబర్ షఫీ, అధికారులు పాల్గొన్నారు.

# ఆదర్శ పాఠశాలల్లో పనులు త్వరగా పూర్తిచేయాలి



సంగారెడ్డిలోని చింతల్‌పల్లి పాఠశాలలో పిల్లలకు పుస్తకాలు, యూనిఫామ్ అందజేస్తున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి అర్బన్, జూన్ 10:అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను వెంటనే పూర్తి చేయాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని చింత్‌పల్లి, హస్టల్‌గడ్డ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలతో పాటు మండలంలోని ఇస్మాయిల్‌ఖాన్‌పేట ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను ఆమె సోమవారం పరిశీలించారు. ఇంకా పూర్తికాని పనులుంటే త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయా పాఠశాలల్లో బడిబాట కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. కొత్తగా చేరిన విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్ అందజేశారు. ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించేందుకు ప్రతీ ఒక్కరి భాగస్వామ్యం కావాలని సూచించారు. బడిబాటను పకడ్బందీగా నిర్వహించి పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, సెక్టోరియల్ ఆఫీసర్ వెంకటేశం, ఎంఈవో వెంకటనర్సింహులు, ఏఈ రాజమల్లయ్య, సీఆర్‌పీ దత్తు, హెచ్‌ఎంలు సామెల్, శైలజారాణి, ఉపాధ్యాయులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణ సక్సెస్‌పై హర్షం

పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విజయవంతంగా నిర్వహించినందుకుగాను టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో కలెక్టర్ క్రాంతిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జ్ఞాపికను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో సంక్షేమ పథకాలను అర్హులకు చేరవేసేలా ఉద్యోగులందరూ చొరవ చూపాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు జావేద్ అలీ, సెక్రటరీ వి.రవి, అసోసియేట్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాస్, మమత, ఉద్యోగులు పాల్గొన్నారు.

# పలు మండలాల్లో బీజేపీ నాయకుల సంబురాలు



జహీరాబాద్‌లో బీజేపీ నాయకుల సంబురాలు

జహీరాబాద్, జూన్ 10: ప్రధానిగా నరేంద్రమోదీ మూడోసారి ప్రమాణస్వీకారం చేయడంతో పట్టణంలో బీజేపీనాయకులు, అభిమానులు సోమవారం ఘనంగా సంబురాలు జరుపుకున్నారు. టపాసులుపేల్చి, స్వీట్లు పంచుకున్నారు. అనంతరం బీజేపీ అసెంబ్లీకన్వీనర్ నౌబాద్ జగన్, సీనియర్ బీజేపీ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు మాట్లాడుతూ మరోమారు నరేంద్రమోదీ ప్రధానమంత్రి కావడంతో దేశం మరింత అభివృద్ధి చెందనున్నట్లు చెప్పారు. కేంద్రమంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన కిషన్‌రెడ్డి, యాశో శ్రీపాదనాయక్, బండిసంజయ్ తదితరులకు సామాజిక ఉద్యమకారుడు, సీనియర్ బీజేపీ నాయకుడు డిల్లీ వసంత్ పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు.

● మనోహరాబాద్: దేశ ప్రధానిగా మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేయడంతో మండల బీజేపీ నాయకులు సోమవారం సంబురాలు చేసుకున్నారు. మనోహరాబాద్ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు నరేందర్ చారి ఆధ్వర్యంలో మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, వెంకటేష్, జిల్లా సీనియర్ నాయకులు ఐలయ్య యాదవ్, లక్ష్మణ్‌సింగ్, శ్రీశైలం, ప్రవీణ్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రులను కలిసిన మెదక్ జిల్లా నేతలు

మెదక్ అర్బన్, జూన్ 10: కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన బండి సంజయ్‌కుమార్, కిషన్‌రెడ్డిలను సోమవారం ఢిల్లీలో మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## కొనసాగుతున్న పదో తరగతి పరీక్షలు

సంగారెడ్డి అర్బన్, జూన్ 10: పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. సోమవారం జీవ శాస్త్రం పరీక్షను సంగారెడ్డిలోని కరుణ హైస్కూల్, రామచంద్రాపురంలోని జడ్పీ హైస్కూల్, జహీరాబాద్‌లోని సిద్ధార్థ హైస్కూల్ కేంద్రాల్లో నిర్వహించారు. మొత్తం 173 మందికి 126 మంది హాజరుకాగా, 47 మంది గైర్హాజరయ్యారు. 72.83 శాతం హాజరు నమోదైందని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. సంగారెడ్డిలోని కరుణ హైస్కూల్ కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ చేశారు.

## ప్రేమతత్వంతో వ్యవహరించాలి



ఖేడ్‌లో సత్యనారాయణ స్వామికి జలాభిషేకం చేస్తున్న మాధవానంద సరస్వతి స్వామి

నారాయణఖేడ్, జూన్ 10:ప్రేమ తత్వంతో వ్యవహరిస్తే ప్రతి ఒక్కరిలో పరమాత్మ కనిపిస్తాడని రాంపూర్ ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ అన్నారు. సోమవారం నారాయణఖేడ్ పట్టణ శివార్లలోని శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయ 23వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. సమస్త ప్రపంచంలోని సర్వప్రాణుల్లో, జీవ కోటిలో కనిపించేది పరమాత్మునేనన్నారు. నిరాకారుడైన పరమాత్మను తన కోసం కాకుండా ఇతరుల కోసం ప్రేమించాలని, అప్పుడే నిజమైన పరమాత్ముడిని చూడగలరన్నారు. ఒకరి పట్ల తప్పు చేయకుండా, తప్పును చేయించకుండా జీవితాన్ని సరిదిద్దుకుంటూ పోతేనే మానవ జన్మకు మోక్షం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ ఆలయ వ్యవస్థాపకులు చిన్నిమధూకర్ కుటుంబ సభ్యులు స్వామికి పాదపూజ చేశారు. కార్యక్రమంలో స్థానిక వేద పండితుడు గురురాజ్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

## పోతంశెట్‌పల్లిలో డీఈవో పల్లెనిద్ర



పోతంశెట్‌పల్లి పాఠశాలలో పల్లె నిద్ర చేస్తున్న డీఈవో

కొల్చారం, జూన్ 10: మండల పరిధిలోని పోతంశెట్‌పల్లి గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం డీఈవో రాధాకిషన్ పల్లె నిద్ర చేశారు. కార్యక్రమంలో ఎంఈవో నీలకంఠం, పాఠశాల ఇన్‌చార్జి మధూకర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు సంగయ్య, ఎల్లేశం, వెంకటేశం, పంచాయతీ కార్యదర్శి అరుంధతి, సీఆర్పీలు సాయికుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యలపై సానుకూలంగా స్పందించాలి



ఆర్డీవోను సత్కరిస్తున్న రైతు రక్షణ సమితి సభ్యులు

నర్సాపూర్, జూన్ 7: తమ సమస్యల పరిష్కారానికి వచ్చే రైతుల పట్ల తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించేలా చూడాలని నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డిని రైతురక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు యాదాగౌడ్, గౌరవ అధ్యక్షుడు మైసయ్యయాదవ్‌లు విజ్ఞప్తి చేశారు. సోమవారం రైతురక్షణసమితి తరపున ఆర్డీవోను కలిసి శాలుశాతో సత్కరించారు. ఈ సందర్భంగా రైతులకు సంబంధించిన పలు సమస్యలను ఆర్డీవో దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో రైతు రక్షణ సమితి నాయకులు ప్రభుగౌడ్, అర్జున్, శేఖర్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## గౌడ సంఘం కమ్యూనిటీహాల్ పనుల పరిశీలన

మనోహరాబాద్, జూన్ 10: మండలంలోని రామాయపల్లి గ్రామంలో జడ్పీ నిధులతో నిర్మిస్తున్న గౌడసంఘం కమ్యూనిటీహాల్ పనులను ఛైర్‌పర్సన్ హేమాలత శేఖర్‌గౌడ్ సోమవారం పరిశీలించారు. రామాయపల్లిలో రూ. 10 లక్షల వ్యయంతో చేపట్టిన కమ్యూనిటీహాల్ పనులను 20 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులతో పాటు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. జడ్పీ ఛైర్‌పర్సన్ వెంట ఏఈ మధుసూదన్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు రతన్‌లాల్, గౌడ సంఘం నాయకులు ఉన్నారు.

## 'ఏలేటి'కి ఉత్తమ లయన్స్ చైర్మన్ అవార్డు

రామాయంపేట, జూన్ 10: మూడు దశాబ్దాలకు పైగా వివిధ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న లయన్స్, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ ఏలేటి రాజశేఖర్ రెడ్డికి ఉత్తమ అవార్డు దక్కింది. ఈ మేరకు ఆదివారం రాత్రి నిజామాబాద్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో లయన్స్ జిల్లా గవర్నర్ వేమూరు లక్ష్మి ఈ పురస్కారాన్ని అందజేశారు. రక్త దానం, అవయవ దానాల అవశ్యకతపై పల్లె ప్రాంతాల్లో జనాల్లో ఏలేటి అవగాహన కల్పించారు. అంతే గాక స్థానిక లయన్స్ క్లబ్ చైర్మన్ దేమే యాదగిరితో కలిసి పలు సేవలందించినందుకు ఉత్తమ అవార్డులు వచ్చాయి.

## బ్రాహ్మణసేవాసంస్థ ఆధ్వర్యంలో మరిన్ని సేవలు



ప్రమాణ స్వీకారం చేస్తున్న బ్రాహ్మణ సేవాసంస్థ నూతన కార్యవర్గం

జహీరాబాద్, జూన్ 10: బ్రాహ్మణసేవాసంస్థ ఆధ్వర్యంలో మరిన్ని సేవాకార్యక్రమాలను చేపట్టనున్నట్టు ఆసంస్థ నియోజకవర్గ అధ్యక్షుడు రాజ్‌కుమార్ దేశ్‌పాండే పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్ బ్రాహ్మణసేవాసంస్థ నూతనకార్యవర్గాన్ని సంగారెడ్డిలో ఆదివారం రాత్రి జిల్లా అధ్యక్షుడు సురేష్ జోషి ఆధ్వర్యంలో ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా రాజ్‌కుమార్‌దేశ్‌పాండే, ప్రధాన కార్యదర్శిగా బాల్‌చందర్‌జోషిలను ఎన్నుకున్నట్టు తెలిపారు. ఉపాధ్యక్షులుగా డా.శేషపద్మనాభరావు, కృష్ణారావుకులకర్ణి, వెంకటరమణ, శ్యామ్‌రావుకులకర్ణి, రమేశ్‌కులకర్ణి, మాణిక్‌రావుజోషీలను ఎనుకున్నట్టు తెలిపారు. అలాగే మరికొందరిని సహాయ కార్యదర్శులుగా, ప్రచారకార్యదర్శులుగా, సభ్యులుగా, ఎన్నుకున్నట్టు చెప్పారు.

## పుల్కల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



జడ్పీ పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

పుల్కల్, జూన్ 10: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీ 1998-99 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. 25 సంవత్సరాల తర్వాత ఒక చోట కలుసుకోవడంతో పరస్పరం ఆత్మీయంగా పలకరించుకుంటూ క్షేమ సమాచారాలను పంచుకున్నారు. ఆట పాటలతో రోజంతా సందడి చేశారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

## ఆర్టీసీ బస్టాండ్‌లో క్యాంటీన్ ప్రారంభం

నారాయణఖేడ్, జూన్ 10: ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన అన్నపూర్ణ హోటల్ క్యాంటీన్‌ను సోమవారం డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్టీసీ మార్కెటింగ్ సేల్స్ ఇన్‌చార్జి పాండు, జడ్పీటీసీ లక్ష్మీబాయి, మాజీ మున్సిపల్ చైర్మన్ రుబీనాబేగంనజీబ్ ఉన్నారు.

# గ్రామాల్లో బడిబాట ర్యాలీలు



చేగుంట మండలంలో బడి బాట ర్యాలీ

పెద్దశంకరంపేట, జూన్ 10: మండల పరిధిలోని ఆయాగ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో బడిబాట కార్యక్రమం సోమవారం కొనసాగింది. ఆయా గ్రామాల్లో బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని ఉపాధ్యాయులు, ఇతర అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. మండలకేంద్రంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి బి.వెంకటేశం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● చిలప్‌చెడ్: బడీడు పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలని ఎంఈవో బుచ్చానాయక్ పేర్కొన్నారు. సోమవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని అంగన్‌వాడీ పాఠశాల నుంచి పిల్లలను ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో సీఆర్పీ రాజశేఖర్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్ ఉన్నారు.

● రేగోడు: మండలంలోని గ్రామాల్లో ఉపాధ్యాయులు బడిబాట ర్యాలీలు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులను పంపించాలని కోరారు.

● చేగుంట:మండలంలో చేగుంట, చిట్టోజిపల్లి గ్రామాల్లో సోమవారం ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్, విద్యార్థులు బడిబాట ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనరసింహ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. బడి ఈడు పిల్లల ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంగన్‌వాడీ టీచర్లు, పంచాయితీ సెక్రటరీలు పాల్గొన్నారు.

● రామాయంపేట: మండల పరిధి ధర్మారం గ్రామంలో సోమవారం బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సర్కారు బడుల్లో చేర్పించడం వల్ల ప్రయోజనాలను వివరించారు.

● మనోహరాబాద్: చిన్న పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రం సురక్షితమైనదని మండల అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సక్కుబాయి పేర్కొన్నారు. సోమవారం మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం బడిబాట పథకంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ నర్సాపూర్ ద్వారా అడ్మిషన్లు (తెలుగు, ఇంగ్లీష్) మీడియం ఎల్‌కేజీ, యూకేజీ క్లాసులు ప్రారంభమైనట్టు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సక్కుబాయి తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏడబ్ల్యూటీ నాగరాణి, సుశీల, అనిత, అంగన్‌వాడీ పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.